


# ప్రేమప్రభావము

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

౧

వేంకయ్యానాయుడు చాల స్థితిమంతుడని పేరు పొందినవాడు. అతడు మెట్రిక్యులేషను పరీక్షలో నొకదెబ్బతిని వెనుకకు మరలియుండుటచే నాతడు చదువుకొనినవాడనియే చెప్పవలెను. వేంకయ్యానాయుడు జనపనారవర్తకముచేసి ధనవంతుడైనవాడు. కాన నాతనికి జనపనాయుడనికూడ పేరుగలదు. పేరున కాతడు నాస్తికుడైనను మూర్ఖుల కాతడట్లుండడు. ఆతని చూచినవారు ఏ హైకోర్టులాయరో, ఏ డిప్యూటి కలెక్టరో యనునట్లుండును. నల్లపట్టంచు తెల్లధోవతి, నల్లనిపట్టుకోటు, దానిపై సేలంఅంచు జరీఖండువా, జేబులో జార్జిఫిఫ్తు పతకమువేసిన బంగారపు గొలుసుగల గడియారము, శిరమున రాజమండ్రి పట్టుసెల్లా తలపాగ, కాళ్లకు జోడు, కన్నులకు జోడు, చేతిలో బంగారు పిడివేసిన కఱ్ఱ- సర్వదా నాతడిట్టివేషముతో నుండును. పూర్వ మాతనివేషము పరిహాసపాత్రముగ నుండినను బ్రాహ్మణేతరప్రాముఖ్యమువచ్చినతరువాత నాతనివేషము నెవ్వరు స్పృశకాలేదు. శ్రీకృష్ణుని గోపాంగనలు వరించినట్లు జిల్లాబోర్డు, తాలూకాబోర్డు, మ్యునిసిపాలిటి మున్నగు స్థానిక సంఘములలోని సభ్యత్వ అధ్యక్షత్వాది పదవు లనేకము లాతని వరించి యాతనివేషమును సార్థకపఱచినవి. అయినను నాయుడు కీపదవు లన్నియు లభించుటకు ధనము, వేషము, అబ్రాహ్మణత్వమే కాకుండా మఱి కొన్ని సుగుణములుగూడ నున్నవి. అందు మొదటిది అధికారప్రాపకసంపాదన. ఆ విషయమున నాయుడు అందెవేసినచేయి. ఆవిషయమున నాతనికి యుచ్చనీచములు లేవు, గొప్పకొద్దులు లేవు. ఎన్ని యకృత్యము లైనఁ జేసి, ఎన్ని శ్రమలైనపడి, ఎంతధనమైన వెచ్చించి, అధికారిని లోబఱచుకొనును. అభిరుచినిబట్టి పదార్థము లర్పించి అధికారిని మెప్పించుటలో నతని కతఁడే సాటి.

అతనికడనున్న రెండవసుగుణము అభిమానశూన్యత. ఏవిషయమునయైన నపజయము గలిగినచో నాత డభిమానపడి యూరకుండడు. ఏకృత్రిమోపాయము ద్వారానైన జయమందుటకు కాతడు విశ్వప్రయత్నము చేయును. నాయుడుకు ధనముతోపాటు, అధికారములతోపాటు వృద్ధిపొందినది బ్రాహ్మణద్వేషము. బ్రాహ్మణాధిక్యము నాత డెంతమాత్రము సహింపడు. దుంపతెగ బ్రాహ్మణులనియో, బ్రాహ్మణముండాకొడుకులనియో, తిట్టుటపదము లేక ఆతడేవేళనుగూడ బ్రాహ్మణనామ మే యుచ్చరింపడు. అధికారరీత్యా తనకడకువచ్చు బ్రాహ్మణుల కాతడు సామాన్యమైనంత యగౌరవము చేయును. అంతకంటె లోకువైనవారి నాతడు 'ఒరే! బ్రాహ్మణా!' యని సంబోధించుట పరిపాటివిషయమే. పూర్వమెట్లున్నను సహాయనిరాకరణోద్యమము వచ్చినతరువాత నాతనిమాట తడిపిన మైదాపిండివలె యిచ్చవచ్చినట్లు సాగుచున్నది. వివాహాదిశుభకార్యములలోను, శ్రాద్ధాది క్రియలలోను నాత డనాదిగా వచ్చుచున్న బ్రాహ్మణపురోహితమును మూడుసంవత్సరములక్రిందటనే వదులుకొని, కాపుశాస్త్రులనో, చౌదరిశాస్త్రులనో రెడ్డిశాస్త్రులనో పిలిపించి పురోహితక్రియల నడిపింప సాగించినాడు. ఈవిధముగా నాయుడు బ్రాహ్మణేతరుల కొక యాదర్శనాయకుడై, దొరతనమునకు నమ్మినబంటై, దేశభక్తులకు గర్భశత్రువై విరాజిల్లుచున్నాడు. బ్రాహ్మణేతరుల కాతనినుడి వేదవాక్యము.

౨

లక్ష్మీదేవి వేంకయ్యానాయుడుభార్య. లక్ష్మీదేవి పల్లెటూరు మనిషి. న్యాయమర్మము తెలియదు. బాబు

డన్నా తెలుగదు. దైవభక్తి, పాపభీతి, బ్రాహ్మణ గౌరవము గలిగి దయాధర్మాది సద్గుణములుగల యుత్తమ సాధ్వియని కీర్తిగాంచిన యిల్లాలు. పేదలయార్తనాదము, పెద్దలతిరస్కారము నామె విని సహింపదు. బంధుమిత్రులకును గ్రామస్థులకు నామెయనిన మిగులగౌరవము. అతనిప్రకృతికి కేవలము ప్రతికూలముగానుండుటచే నామె యొక్కొక్కప్పుడు వేంకయ్యనాయుని తీవ్రకోపమునకు గురియగుచుండును. నాయుడు అనాదిగా వచ్చుచున్న బ్రాహ్మణపురోహితుని తొలగించినప్పుడు ప్రాచీనాచారమును రూపుమాపవలదని లక్ష్మీదేవి భర్తను వేవిధముల బ్రార్థించినది. నాయుడు వినలేదు. బ్రాహ్మణులను నామెనుగూడ నొవ్వదిట్టి తండ్రిశ్రాద్ధమును బ్రాహ్మణేతరపురోహితునిచే యథావిధిగ నిర్వర్తింప జేసినాడు. అది జరిగిన పదియైదురోజులకే వేంకయ్యనాయుడు కొమార్తె, పదునాలుగేండ్ల చిన్నది, వివాహయోగ్యయై యున్నది, రెండురోజులు జ్వరముతగిలి పుటుక్కున జచ్చినది. అది దైవికమైనను లక్ష్మీదేవి యమాయకపు బుద్ధికిమాత్ర మది బ్రాహ్మణతిరస్కారమువలన గలిగిన కీడేయని గట్టినమ్మకము గలిగినది. బ్రాహ్మణభక్తి మఱింత ప్రబలమైనది. అందుచేతనే బ్రాహ్మణబ్రువులు కొందఱు వీథివాకిట వెళ్లిన నాయుడుగారు శపించెదరని దొడ్డివాకిటవెళ్లి నాయుడు పత్నిచే సత్కరింపబడి వచ్చుచుందురు.

రామస్వామి వేంకయ్యనాయుని యేకపుత్త్రుడు. ఇరువదియేండ్ల వయస్సు. చెన్నపురిలో బి.యల్. తరగతిలో జదువుచున్నాడు. రామస్వామికి వేంకయ్యనాయునకు బ్రహ్లాద హిరణ్యకశిపుల కున్నంత తారతమ్యమున్నది. తండ్రిచేయు అకార్యములు రామస్వామికి గిట్టవు. కాని కాదనడు. తనచదువేమొ తానేమొ: ఇతర విషయము లాతడు పట్టించుకొనడు. బ్రాహ్మణద్వేషము కాని, పంచమతిరస్కారము కాని, స్వమత దురభిమానముగాని యాతనికి లేవు. అతడందఱతో సమానముగ వర్తించును. అతనికి బ్రాహ్మణ బ్రాహ్మణేతర పంచమమిత్రులుగూడ కలరు. అతడందఱతో స్నేహముసలిపి యందఱిస్నేహమును జూఱగొనును.

రామస్వామి కింకను వివాహము కాలేదు. వేంకయ్యనాయుడుకు కొమారునికట్నముమూలకముగా గొప్పయాస్తిని బడయవలెనని కోరిక. కట్నమే నిషేధింపవలెనని కొమారుని యుద్దేశము. తండ్రికొడుకుల కీ విషయమున మనస్సులో కలఁతలున్నవి. కాని యింకను పైకి రాలేదు.

ఏపిల్లవలన ఎక్కువఆస్తి వచ్చునో, ఏపిల్లతండ్రి యెక్కువఅధికారప్రాబల్యము కలవాడో ఆలోచింపుచున్నాడు నాయుడు. కొన్ని తానేకొట్టివేయుచున్నాడు. కొన్ని భార్యతో నాలోచింపుచున్నాడు. కొన్ని రామస్వామిదాకా బంపుచున్నాడు. "ఈ పిల్లను జేసికొనిన పాతికవేలరొక్కము వస్తుంది. ఆపిల్లను జేసికొనిన ఏబది యెకరాల పల్లము వస్తుంది. ఆపిల్లను జేసికొనిన లక్షరూపాయలకధికారి మనవాడే యధిపతి." అని నాయుడు కోడలివల్లవచ్చు రాబడినిగూర్చి యోచింపుచున్నాడు. "ఆపిల్ల యింగ్లీషు బాగుగా జదువుకొనినది. ఈపిల్ల సంస్కృతాంధ్రముల బ్రజ్ఞావతి. ఆపిల్ల సంగీతమున సరస్వతి." అని రామస్వామి విద్యావతులగు బాలికలవిమర్శింపుచున్నాడు. డిసెంబరు సెలవులలో రామస్వామి యింటికివచ్చినప్పుడు తల్లి "నాయనా! మీనాయన నీకీవత్సరము పెండ్లిచేయదలంచుచున్నాడు. నీవు అడ్డుచెప్పకు. మీ తండ్రి తగనివాడు. ఆయన యిష్టప్రకారము నడువకపోయిన నీపై కోపించును. ఇప్పుడే మీ తండ్రికి నీవు నచ్చవు. నీవు పెండ్లివిషయమున తగవుపెట్టితివా, సాగదు. ఆయన సరసుడుకాడు. మీయిద్దరిలో కలత నాకు మనోవేదన. మీతండ్రికి చెప్పి యొప్పింపలేను. నీవైన నామాటవిని మీతండ్రి కుదిర్చినసంబంధమున కొప్పుకొనుము." అని బతిమలాడి చెప్పినది.

"అమ్మా! నాన్నకు కోడలితోపాటు గొప్పసంపత్తిని బడయవలెనని కోరికయున్నట్లున్నది. బాలిక విద్యారూపగుణాదులను జూచుకొనవలెను గాని, యాస్తినా చూచుకొనుట? ఇదియేమిసబబు? వారియొద్దసొమ్ము పుచ్చుకొనినగాని మనకు పొట్టగడవదా?"

"మీతండ్రికి గుణము ప్రధానము కాదు. సొమ్మే ప్రధానము. సొమ్మెక్కువ తీసికొనుటలోనే యెక్కువ గర్వత యున్నదని యాయనయూహ."

"గుణము లేని ఆ స్త్రీతో నాకు పనిలేదు."

"నాయనా! నేను నీకు మొదటనే చెప్పితినిగదా, ఆయనవలెనె నీవు గూడ మూర్ఖపుబట్టు బట్టవలదని! నీవు గూడ నిట్లు మాట్లాడిన నేమి చేయగలను?"



తండ్రి తగనివాడని రామస్వామికి దెలియును. అమాయకురాలగు తల్లి యాతని నెదురాడ నేరదనియు నాతడెఱుగును. కావున తల్లిని దన్నుగూడ నాముప్పునుండి తప్పింపవలెనని రామస్వామికి దోచినది. కాన తల్లి వంక జూచి "అమ్మా! ఈ సెలవులు వెళ్లిపోయినవి గదా! ఇక వేసవికాలమువఱకు పెండ్లికవకాశమే లేదు. నాకిది రెండవయేడు. పరీక్షలు సమీపించినవి. ఈరెండు మూడు నెలలు గట్టిగా జదివినగాని గట్టెక్కను. కాన వేసవివఱకీవిషయము నాపియుంచుమని నాన్నతో జెప్పుము. అప్పుడు సావకాశముగా సంబంధముల మంచి చెడుగు లాలించి, యవసరమగుచో నాన్న యిష్టప్రకారమే పోవచ్చును" అన్నాడు. కొమారుని పలుకులు లక్ష్మీదేవి కెంతయో హృదయశాంతిని గలిగించినవి. రామస్వామి చెప్పినవిషయము భర్తతో జెప్పినది. నాయుడు గూడ పరీక్షల ప్రాముఖ్యము గుర్తించి వివాహయత్నమాపుచేసినాడు. శీతకాలము వెళ్లగనె రామస్వామి చెన్నపురి వెళ్లినాడు.

## 3

౧౯౨౧ సంవత్సరము వచ్చినది. మహాత్ముడుపదేశించిన అసహాయోద్యమతత్త్వము ఉత్సాహభరితులగు నాంధ్రులహృదయమున జక్కగా నాటుకొనినది. స్త్రీలు, పురుషులు, ధనికులు, పేదలు, ఉద్యోగులు, విద్యార్థులు, వర్తకులు, వ్యవసాయదారులు-వీరువారననేల- సర్వవర్ణములవారును, సర్వవృత్తులవారును ఉద్యమములో జేరి యుత్సాహముతో బనిచేయనారంభించినారు. మార్చినెలలో విజయవాడయందు జరిగిన దేశీయమహాజనసభా స్థాయిసంఘ సమావేశమున కేతెంచిన గాంధీమహాత్ముడు ఆంధ్రదేశమున పర్యటనమొసల్పి, ఆంధ్రులు కార్యోన్ముఖులగునట్లుద్బోధించి, యేప్రియలు మొదటివారములో చెన్నపురి చేరికొనినాడు. చెన్నపురిపౌరు లత్యుత్సాహముతో మహాత్మునకు స్వాగతమొసగిరి. సముద్రతీరమున గొప్ప సభ సమావేశమైనది. మహాత్ము డా సభయందు అసహాయోద్యమమునకు మూలసూత్రములైన సత్యము, త్యాగము, అహింస, ఐకమత్యము నను నాల్గుసూత్రములను గూర్చియు, న్యాయస్థానములు, శాసనసభలు, పాఠశాలలు, విదేశవస్త్రములు, అస్పృశ్యత, మద్యపానము నను షడ్విధబహిష్కారములను గూర్చియు, గంభీరమైన యుపన్యాస మొసగినాడు. రామస్వామిగూడ ఆమహాసభకేగి మహాత్మునియుపన్యాసము నామూలాగ్రముగ నాలించినాడు. మహాత్ముని పలుకు మహాత్మునికే యొప్పగించి వచ్చిన యనేకులవలె గాక మహాత్ముడు చెప్పిన ప్రతివిషయము రామస్వామిహృదయమున గాఢముగా నాటుకొనిపోయినది. సభ ముగిసినది. రామస్వామి తననివాసమున కేతెంచినాడు. కాని తన శ్రోత్రేంద్రియముకడ జేరి ముక్తకంఠముతో మహాత్ముడు భారతయువకుల కర్తవ్యమును బోధించుచున్నట్లే రామస్వామికి స్ఫురింపసాగినది. రామస్వామి తనగది చేరగనె దీపము వెలిగించి కిటికీకెదురుగ బడుక కుర్చీ వైచుకొని యాలోచింపుచు గూర్చున్నాడు. పరీక్షకై యాతడు దీక్షతో జదువుచున్న లా పుస్తకములు బల్లపై చీకాకుగ బడియున్నవి. అతని ప్రాంత కాగితములు వాతాహతిచే తనహృదయమువలెనే

తపతపు గొట్టుకొనుచు ఒత్తిహస్తముల నాతనికి స్వాగత మొసగుచున్నవి. వంకెలపైనున్న నీలం అంచు జరీఖండువాలు, పట్టుత్తరీయములు సాగరవీచీ పవనంబులను రామస్వామి మానసమునుబోలి యుయ్యాల లూగుచున్నవి. రామస్వామి వానిని వేనిని పరికించుట లేదు. అతని మానసము మహాత్ముని యుపన్యాస చింతనములో మగ్నమైపోయినది. సమస్తేంద్రియములు, సమస్తవృత్తులు ఆమానసిక చింతలో లీనమై కట్టువడి పోయినవి. అతనికి బాహ్యజగత్తే దూరమైపోయినది. ఏకాగ్రమోదనకు గడంగినాడు.

మహాత్ముని యుపన్యాసము నాలకించినది మొదలాతడొక నూతన ప్రపంచమున బ్రవేశించిన ట్లున్నాడు. నవ్యచైతన్యము, నవోత్సాహము, నవ్యభావములు! అంతయు నవ్యమే! అతనితనువే నవ్యరూప మెత్తినట్లున్నది. అప్పటి కాతనిదృష్టియందు చదువులు, పరీక్షలు, ఉద్యోగములు కేవలము నిస్సారములుగ, నిస్తేజములుగ, నిరుపయోగములుగ గాన్పించుచున్నవి. ఇట్టి పనికిమాలిన పదవులకై యమూల్యమును, సుకృతమును నగు జీవితమును వ్యయము సేయుటకంటె భౌతికము లగు నీయున్నతోద్యోగములకు జలాంజలి యొసంగి, మహాత్ముని యాన శిరసావహించి మాతృదేశారాధనము సేయుట యుక్తముగాదా యను నూత్నభావ మొకటి యాతని మానసమున నుదయించినది. మానవసేవయే దేశసేవ. దేశసేవయే దైవసేవ. దైవసేవయే ఆత్మసంతుష్టి. ఆత్మసంతుష్టియే యాత్మోపలబ్ధి. అంతకంటె కావలసినదేమి! ఉన్నతపదవ్య, పట్టపుబిరుదులు, ఉద్యోగయత్నములు, అధికారపదవులు, బిరుదులు, సన్మానములు— వీనివలనలో జిక్కిన నెప్పటికైన వాంఛాసిద్ధి, ఆత్మసంతుష్టి యనునది కలదా? లేదు. వీని నన్నిటిని వదలి భారత జననీ దాస్య విమోచన దీక్షావ్రతుడగు మహాత్ముని యాన శిరసావహించి జన్మసాఫల్యము నందుట మేలుగాదా యని రామస్వామి యూహించినాడు. అంతకంటె నుత్తమకర్మము లేదని నిశ్చయించినాడు. కాని వెంటనే రామస్వామిగుండె జల్లుమన్నది. శరీరమాపాదమస్తకము కంపించినది. నేత్రము లశ్రుసిక్తములైనవి. "దుష్టుడా, ఏమినీతలంపు! అధికవ్యయముచేసి నేచెప్పించిన నగుచదువంతయు పాడుచేసి నన్నాశ్రయస్వైపోవలెంబితివా! ఛీ, దరిద్రుడా! పొమ్ము! నాగృహమును విడిపొమ్ము! నాయాశ లడుగంటజేసి, నాకపయశమును దీసికొనివచ్చి, నాయింటి కేమని వచ్చితివి? పుత్రుడవై పుట్టిన శత్రుడా! పొమ్ము! నాగృహము విడిపొమ్ము! నీకును నాకును ఋణము తీరినది. పొమ్ము." అని రక్తవీక్షణములతో పండ్లు పటపట కొరుకుచు భయంకర క్రోధమూ



ర్తియై తండ్రి తనయెదుట నిలువబడినట్లు రామస్వామి మనోదృష్టికి దోచినది. మహాభయముచే రామస్వామి గడగడలాడి కన్నులు మూసికొనినాడు. కాని లాభమేమి? మనోదృష్టికి మఱుగేమున్నది? నిమీలితనేత్రుడైననుగూడ తండ్రియాకృతి యాతనికగపడుచునే యున్నది. ఇన్నియేండ్లువచ్చి తండ్రికి తాననుకూలముగ బ్రవర్తించునప్పుడే యాతని కెదురాడువాడు రామస్వామి తండ్రికి కోపకారణమగు నీవిషయమున నెట్లు నిర్భయుడై ప్రవేశింపగలడు? తండ్రియానతి శిరసావహించెనా, ఉద్యోగములు, ఉన్నతాధికారములు, ధనసంపదలు, సర్వసుఖములు; కాని ఆత్మకు సంతుష్టిలేదు: జన్మకు సాఫల్యములేదు. పారతంత్ర్యభారమునకు విమోచనములేదు. కావున మహాత్మునియానతి నంగీకరించెనా, తండ్రితోడి బలవద్విరోధము! గృహత్యాగము! మాతృదుఃఖము! శ్రమ! దారిద్ర్యము! వేయేల, అనంతసుఖములు దూర; అనంతకష్టములు దీన. ఇందేది శ్రేష్ఠమైనది? రామస్వామి దీర్ఘముగ నాలోచించెను: "తండ్రికి బ్రియము

సేయుటకై మనస్సాక్షికి వ్యతిరేకముగ వర్తించుట గుస్తరమైనపని. కాన ప్రహ్లాదునివలె తండ్రి పెట్టు బాధలకోర్చి గాంధియుద్యమమున జేరి దేశసేవ చేసితీరెదను." అని కృతనిశ్చయుడైనాడు. ఏదియో యొకనిశ్చయమునకు వచ్చుటచే రామస్వామియభిప్రాయము తేలికపడినది. "వత్సా! వీరపురుషోచితమైన నిశ్చయము చేసితివి." అని యంతరాత్మ యతని నభినందించినది.

## ౪

తెల్లవారినది. రామస్వామి నిద్దురలేచి ప్రాతఃకృత్యముల నిర్వర్తించుకొని యాలోచనాధీనచేతస్కుడై కుర్చీలో గూర్చున్నాడు. ఇంతలో రామస్వామికి మిత్రుడును సహపాఠియు నగు కృష్ణయ్యవారి వచ్చి రామస్వామి యెదుటి కుర్చీపై గూర్చుండి, "రాత్రి యెంత ప్రయత్నించినను వచ్చుటకు వీలు కాలేదు. మాపిల్లకు గొంతెము సుస్తీగా నున్నది. కుటుంబముతో వచ్చినవారికి దేకష్టము. నిశ్చింతగా జదువుకొనుటకు వీలుండదు. నీవు చాల చదివినావు కాబోలు అనుకున్నాను. ఏమి చేయను! రాజాలక పోయినాను" అనెను. రామస్వామి మందహాసవదనముతో సోదరునిదెస జూచుచు, "మిత్రుడా! దిగులుపడకు. చదువలేదు; నిగుదను. పరీక్షాజయము నీదె కాని నాది కాదు" అన్నాడు.

"ఏమి! క్రొత్తమాట లాడుచున్నావు! గాంధి తత్త్వము తలకు పట్టలేదు గద!"



"పట్టినది, బాగుగా బట్టినది."

"ఎంతవరకు?"

"ఈ చదువులు, ఉద్యోగములు, బిరుదులు, సన్మానములు వ్యర్థము లనువరకు."

"ఓహో! చాలముందుకు బోయినావే! ఒకవ్రాతతో నున్నది రెండేండ్లశ్రమ. ఏదోవిధముగా దీనిగూడ నెగ్గుము. తరువాత తీరుబడిగా గూర్చుండి వ్యర్థసార్థకము లూహింతువుగాని."

"రాత్రి పరీక్షయైనది. ఫలితము తెలిసినది. ఇక చెన్నపురి వీడుటయే తరువాయి. అది సాయంత్రము జరుగును."

"వినదగు నెవ్వరు సెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్."

అని మనము చిన్ననాడె చదువుకొంటిమి. ఆనీతి ప్రతివిషయమున నవలంబింపదగినది. నిదానముగా నాలోచింపక యేపనియు చేయరాదు."

"దీర్ఘముగా నాలోచించియే నిశ్చయించితిని; తొందరపడలేదు. మనసు నీరగునట్లు మహాత్ముడు పలికిన వాక్యము లాలించియు, సోదరీ! ఇంకను జదువుటకును నుద్యోగములు సేయుటకును నీమానస మెట్లంగీకరింపుచున్నది!"

"మహాత్మున కేమి? ఎన్నైన జెప్పును. వాని నన్నిటిని మన మాచరింపగలమా? ఆయన సర్వము వదలుకొని సన్న్యసియై, దేశజనులకు సన్న్యసమిప్పించుటకు బూనుకొనినాడు. మెత్తనిచలువలను వదలి కంపగుడ్డలను కట్టుడనియు, కమ్మని నెయ్యియన్నమును వదలి ముడిగోధుమలను తినుడనియు మహాత్ముని బోధ. ఇది యేమిపని! పూటకు గుడ్డకు గలవారు గూడ పేదతనము ననుభవించినచో లోకములో పేదలనియు, భాగ్యవంతులనియు తారతమ్యమేమున్నది? ఈయాందోళనల కేమి! వచ్చుచుండును, పోవుచుండును. వందేమాతరం గడబిడ మూడలేదా, మూడునాళ్ల ముచ్చటైనది. నాడు చదువులు మానియు, నుద్యోగములు మానియు, భ్రష్టులైనవారెందరో నేటికిని నశ్లేయున్నారు. కాని

నాటినాయకులైన బెనర్జీ, పాలు మున్నగువారు నేడు దొరతనమునకు జేయూతయై వారొసగిన యుద్యోగములు, బిరుదులు నందుటకు సిద్ధమైనారు. ఈయుద్యమము గూడ నట్టిదే. మూడునాళ్లు; దొరతనమువారేదైన రుచి చూపిరేని యీనాయకుడుగూడ అంతే. ఇట్టిబూటకపుటుద్యమములనమ్మి మన చదువులుపాడుచేసికొని, యుద్యోగలాభములు చెడగొట్టుకొని, ధనార్జన చెఱుచుకొని, సౌఖ్యమును మంటగలుపుకొని, తలిదండ్రులకు దూరమై దారిద్ర్యమునకు జేరువై, మన మేల భ్రష్టులము కావలెను?"

"చాదరీ! దీర్ఘోపన్యాసమొసగితివి. నాహితముకోరి నీవు చేసిన హితోపదేశమునకు గృతజ్ఞుడను. కాని యొకమనవి: దేశము, మతము అనునవి మనుష్యునకు ప్రాణముకంటె ప్రియతరములు. ఈరెండిటికిని తమప్రాణములను ధారవోసిన వీరవ్రతుల నెందఱినో మనము దేశచరిత్రములలో గాంచుచున్నాము. కాని మన నేటిచదువు మనలో జీవశక్తినిజంపి స్వార్థచింతను ప్రేరేపించునదిగా నుండుటజేసి మనలో దేశాభిమానము నశించిపోయినది. లేకున్న విద్యార్థకుడవగు నీనోట నిట్టి మాటలురావు. వందేమాతరపు గోల పోయినదంటివి. ఎక్కడకు పోయినది? నాటియుద్యమములో బుట్టిన జాతీయసంస్థలెన్నియో నేటికిని, నిలిచి ప్రజలలో జాతీయతను పెంపొందించుచున్నవి. నాటిదేశారాధకు లెందరో నేటి నిరాకరణోద్యమములో జేరి దేశసేవకు గడంగినారు. కావున ఉడుకు చల్లారవచ్చునుగాని యుడికిన గుణమెప్పటికి చల్లారదు. ఉద్యమమున కుచ్చనీచము లుండునుగాని నాశ ముండదు. సత్యవ్రతుడును, త్యాగశీలుడును నగు మహాత్మునికంటె యుత్తమ నాయకుడు భారతదేశమున కెప్పటికిని లభ్యపడడు. అట్టివానిచే నేర్పడినఅసహాయోద్యమము బూటకపుటుద్యమముగాదు. అతడు చెప్పిన సూత్రములుగూడ నక్రమములును, నన్యాయములునుగాక ప్రజాక్షేమకరమైనవిగను, పరతంత్ర భారతదేశమున కర్హమైనవిగను నున్నవి. సర్వము వర్జించి సన్న్యాసి గమ్మనుచుండెనని మహాత్ముని నిరసించితివి. స్వార్థదృష్టితో జూచువారికి మహాత్ముని త్యాగతత్త్వము సన్న్యాసముగనే గాన్పింపవచ్చునుగాని నాకుమాత్ర మది మహోత్కృష్టధర్మముగా గాన్పించుచున్నది. ఉత్తమ త్యాగి యెప్పుడును ధనధర్మమును జూచుకొనడు. 'తన భార్య బిడ్డల పోషణమెట్లు? తన సౌఖ్యమెట్లు?' అని స్వార్థమును లెక్కించువాడెట్టి ధర్మకార్యమును జేయజాలడు. 'మనచదువులైన తరువాత, మనయుద్యోగ వాంఛ తీరినతరువాత, ధనముకూర్చినతరువాత, మనుమలు పుట్టినతరువాత'- అని యనుపులు పెట్టినచో మనజీవితములో ధర్మసాధనకు కాలమే లభింపదు. మహాత్మునిచే ప్రబోధితమై నాచిత్తము దేశసేవజేయ నుత్సాహపడుచున్నది. కాన నిరుత్సాహవాక్యములచే నన్ను గలవరపెట్టకుము."

"రామస్వామీ! నీత్యాగశీలతయును, నీమనోదార్ఢ్యము నన్ను సంతోషపఱచుచున్నది. కాని యొకసంగతి యాలోచింపుము: మీతండ్రి ధూర్తుడు. అధికారపక్షపాతి. నీ విట్టిపనిచేసిన కొంపకు రానివ్వడు. ఆసంగతి నాలోచించితివా?"

"ఆలోచించితిని. కొంపకు రానీయకున్న వెలుపలనేయుండ నిశ్చయించితిని."

"అమాయకురాలగు మీ తల్లి యేకపుత్రుడవగు నీవు కనులబడకున్నచో విలపింపదా?"

"చాదరీ, నామనోదౌర్బల్యమును శోధింపనేతెంచినయీశ్వరునివలె నున్నావు నీవు. నీవువేసిన పెక్కుప్రశ్నలు నా మనస్సందేహముల బాపి కార్యదీక్షితుని గావించుటకే తోడ్పడుచున్నవి. యథార్థము తెలిపి యనుజ్ఞ వేడినచో మా యమ్మ విచారింపదు. విచారించినను మానునది లేదు. సత్కార్యములకు విఘ్నము లనేకము లుండుట సహజమేకదా! వాని నెదిరింపవలసినచో సధైర్యముగ నెదిరించుట కాయత్తుడుగనే యున్నాను. కాన నా సంకల్పమును వికల్పముసేయ యత్నింపకుము. విఫలుడ వగుదువు."

ఆశ్చర్యసంభ్రమములతో చాదరి మారుబల్కనశక్తుడై యూరకుండెను.

నిర్ణయించుకొనినప్రకారము రామస్వామి నాటి సాయంకాలమె చెన్నపురివీడి స్వగ్రామమేగెను.

౫

రామస్వామి యింటికివెళ్లిన రెండవ దినమున మధ్యాహ్నము రెండుగంటలకు వేంకయ్యనాయుడు తనగదిలో నటునిటు పచారుచేయుచు, "ఇదిగో, యిట్లు రా!" అని భార్యను పిలిచినాడు. లక్ష్మీదేవివచ్చి ఎదుట నిలిచినది. వేంకయ్యనాయుడావిడదెసజూచి, "ఇదిగో నీకొమారుడికి నచ్చచెప్పు. అన్యాయముగా చెడిపోవద్దను. అయినదేమో అయినది. కడచినదానికి వగచిన లాభము లేదు. ముందుసంగతి చూచుకోవలె. కలెక్టరాఫీసులో ఏభైరూపాయలపని ఒకటి ఖాళీ వచ్చింది. దొరతోచెప్పి ఆపని వేయించుతాను. ఈదినాల్లో మన శూద్రులకు గవర్నమెంటులో పలుకుబడి యెక్కువగా వున్నది. తెలివిగలవాడని అధికారులకు దోచెనా, మూడురోజులలో పైకి తీసుకవస్తారు. మూడేండ్లలో కొడుకు తాసిల్దారవుతాడు." అన్నాడు.

"ఏమో, వాడు వినేటట్టు లేదు."

"వినకపోతే యింట్లో ఒకక్షణం వుండటానికి వీలులేదు. ఇటువంటివాడు కొడుకని యింట్లో పెట్టుకొంటినా, నాకుగూడా ముప్పు; నా అధికారాలు గూడ పోతాయి."

"పోతేపోనియ్యండి; అధికారాలకోసం బిడ్డను విడనాడుకుంటామా? వాడు చెప్పేమాటల్లో యేం తప్పుందని ముప్పువస్తుంది? ఇల్లువళ్లు గల్ల అయ్యే యీ చదువెందుకు? మనపూర్వులంతా యీ చదువులవల్ల జీవించారా? వ్యవసాయం జేసుకొని పాడిపంటలతో సుఖించలేదా? అట్లానే చేతామంటాడు. 'ఏటా గుడ్డకు బోలెడుడబ్బు పోయి, వెలిసాస్తున్నది. సొంతంగా రాటంమీద నూలువడుక్కొని గుడ్డలు నేయించుకుంటే గుడ్డలు మన్నుతాయి, డబ్బు కలిసివస్తుంది' అంటాడు. ఇందులో తప్పేముంది? మా చిన్నతనంలో మానాయనమ్మవడికిననూలుతో కోకలు నేయించుకుంటే మూడేళ్లు కట్టేవాళ్లము. పట్టుపుచ్చువలె అంతమెత్తగా, చామాకువలె అంతసరసంగా వుండేవి. సన్నచీరలు సన్నచీరలు అని గొప్పేకాని యీసన్నాసి కోకలు మూడునెల్లైనా వుండవు. అంతదాకా యెందుకు? ఏటేటా పాతికలు, యేభయిలు పెట్టి రంగురంగుల శాలువలు కొంటుంటారుకదా! వాటిలో యేమైనా సుఖం వున్నదా? సొగసుకేకాని చలి ఆపదుకదా! నేను కాపురానికి వచ్చేటప్పుడు మానాయనమ్మ కట్టెడు నూలువడికి మాలవాడిచేత దుప్పటి నేయించి యిచ్చింది. పాతికేండ్లయింది, యిప్పటికి కొత్తమాయలేదు. అది కప్పుకుంటేమా చలి యేమూలున్నదో తెలియదు. అదిసరి, కొండారెడ్డి గజం స్థలం ఆక్రమించాడని మూడుకోర్టులు తిరిగారు. మూడువేలు ఖర్చుచేశారు. చివరకు అతనిపక్షమయింది. ఇంత బేజారులేకుండా మనవూళ్లోనే మధ్యవర్తులద్వారా పరిష్కారం చేసుకున్నట్లయితే కొంతయినా న్యాయంజరిగేది. లేక వదిలిపెట్టినా యింతనష్టంలేకపొయ్యేది. మూడువేలు పెట్టితే ఎన్నివేలగజాలైన వచ్చేవి. ఇటువంటి నష్టాలులేకుండావుండాలనేకా, మనరామస్వామిచెప్పేది! అందుకోసం వాడిని కొంపలోంచి వెళ్లగొట్టుతారా? పోగాపోగా ఉప్పుగల్లాలెవాడొక్కడుకనబడుతున్నాడు. వాడినిగూడావిడనాడుకోని మనంబావుకునేదేమున్నది?"

వేంకయ్యనాయుడికోపం పట్టరానిదై పోయింది.

"ఛీ నోరుమూయి. ఊరుకున్నకొద్ది నీధోరణి యెక్కువైందే. నీవల్లనే ఆవెధవ యింతపనిచేశాడు. నీవు యేడ్చినాసరే చచ్చినాసరే. వాడు వుద్యోగంలో చేరకపోతే యింట్లో వుండటానికి వల్లగాదు. పో; నీకొడుకుతో రూఢిగా చెప్పు; పో!" అన్నాడు నాయుడు.

"ప్లీడరు సుబ్బారావుగారి అబ్బాయి చదువు చాలించుకొనివస్తే వారు యింట్లో పెట్టుకోని వూరుకోలేదా? ఇట్లాగె వెళ్లగొట్టుకున్నారా?"

"వాళ్లమాటేం చెప్పు. చాలించుకోక చదువుకుంటేమాత్రము బాపనయ్యలకు ఉద్యోగమిచ్చే దెవరు? అటువంటివాళ్లు చదివితేనేమి, మానితేనేమి; వాళ్లకేమి నష్టము? చదువులకోసం మడిమాన్యాలమ్ముకొని బ్రాహ్మణులు బిచ్చపుకే సన్న్యాసులైనారు. వాళ్ల వుద్యోగదాహం చూచి గవర్నమెంటువారు శూద్రాదుల కన్యాయం జరుగుతున్నదని ఉద్యోగాలు యియ్యక బిగించేటప్పటికి ఇబ్బడిసన్న్యాసులైనారు. ఇప్పుడు గాంధి ఉద్యమంలోజేరి ముమ్మడిసన్న్యాసులైనారు. వాళ్లు దీనిలో చేరినా చేరకపోయినా సన్న్యాసమే కాబట్టి వాళ్లకు గలిగే నష్టంలేదు. అనంతలాభాలు పొందటానికి

పిలుస్తున్నవాళ్లను మన మెట్లా ఊరుకుంటాము? నీకేమైన మంచిచెడుగు తెలిస్తేనా! పో! కొడుకుతో చెప్పు, పో!"

లక్ష్మీదేవికి కనులనుండి నీళ్లు జొటజొట కారినవి. నోటమాట రాలేదు. ఆమె కనులనీళ్లను జూచియైనను నాయుడుకు కనికరముకలుగలేదు. మఱింతకోపంతో "నా దగ్గిరయెందుకేడుస్తావు? కొడుకుదగ్గిరఏడు; పో!" అన్నాడు. కన్నీళ్లతో లక్ష్మీదేవి యటనుండి వెడలిపోయినది.

## ౬

లక్ష్మీదేవికి ఓరిమి, కరుణ, శాంతము, వినయము, దైవభక్తి సహజగుణములు. మత్సరుడును, అహంకారియు, దుర్వ్యవసాయియు నగు నాయుడు దుష్టపతి యగుడు గాకుండ నుండుట కేబలవత్తరమైన కారణమైన నున్నచో నది లక్ష్మీదేవి సాధ్వీత్వమే కాని వేఱు గాదు. ఆమె నిల్లాలుగా బడయుటయే నాయుడి పూర్వపుణ్యము. ఉత్తమురాలగు నామెయందు బంధువులకును, మిత్రులకును, దీనజనులకును నసమానమైన గౌరవము. ఇట్టి సర్వజనపూజ్యురాలగు జననియందు రామస్వామి కెనలేని భక్తి. అతనికి తల్లి యొకపరదేవత. ఆమెమాట యాతనికి వేదవాక్యము. ఆతడింతవఱకెప్పుడునుగూడ తల్లిమాట కాదని యెఱుగడు. ఆమెకు వ్యతిరేకముగ బ్రవర్తించి యెఱుగడు. కాని నేడాతని నొక విషమసమస్య యెదుర్కొనినది. దేశహితైకచింతతో మనస్సాక్షి ప్రేరితుడై యాతడసహాయోద్యమమును జేపట్టినందులకు దండ్రి కోపించుచున్నాడు, తల్లి దుఃఖించుచున్నది. తండ్రియాగ్రహముమాత్ర మాతనికి జింతలేదు. కాని తల్లికన్నీళ్లాతనికి వేయిని సంకెలలై నిర్బంధించుచున్నవి.

జననీజన్మభూములు రెండును నాతనికి సమాన గౌరవపాత్రములుగనే యున్నవి. అతడేదిత్రోసి యేదియంగీకరింపగలడు? కాన జననిని సమ్మతపఱచి జన్మభూమిని సేవింప నిశ్చయుడై యాతడు తల్లిసన్నిధి కేతెంచినాడు. ఉద్యమతత్త్వమామెకుబోధపఱచినాడు, తల్లి సమ్మతించినది కాని కొమారునిమాత్రము చూడకఉండలేననుచున్నది. ఎప్పుడును పెనిమిటి కెదురాడని లక్ష్మీదేవి త్రెంపజాలని పుత్రానురాగముచేతనే పెనిమిటికెదురాడ సాహసించినది. కాని నాయుడు వారాపత్యము నాలోచించునంతటి సరసుడా! కాడు. అతని కేయెడనైన గావలసినది తనమాట చెల్లుబడికాని భార్యాబిడ్డల యభీష్టము కాదు. వాళ్లభ్యుదయమే కాని వాత్సల్యము నాతడు లక్ష్యపెట్టడు కావుననే యాతడట్లు భార్యను తిరస్కరింపగలిగినాడు.

భర్తచే నావిధముగా నాశాహతయైన లక్ష్మీదేవి తిన్నగా కొమారునిగదిలోనికేగినది. రామస్వామి గంజి పోవుటకై యుతికి యారవేయించిన క్రొత్త ఖద్దరు చొక్కాకు మడతలు సరుదుకొనుచున్నాడు. లక్ష్మీదేవి కన్నీళ్లచే లడిసిన చెక్కిళ్లతడి యింకను ఆరలేదు. తల్లి యెద్దియో కారణమున దుఃఖించినట్లు రామస్వామికితల్లిని గనుటతోడనే విదితమైనది. తోడనె యాతడు "అమ్మా,- విచారముగా నున్నావెందులకు?" అన్నాడు.

"నాయనా! మీతండ్రి చెప్పినట్లు నీవు ఉద్యోగములో జేరకున్న నిక నిన్నుజూచు ప్రాప్తము నాకు లేదు." అని లక్ష్మీదేవి కన్నుల నీరు నించినది.

"అమ్మా! భయపడకు. వియోగ సంయోగములు మానవయత్నములు గావు. నీవు నన్ను జూడనని భయపడెదవేల? నేనెక్కడకుపోవుదును? నీ వెక్కడకు పోవుదువు? విద్యార్థి బంధమును ద్రెంచుకొని యుద్యోగబంధముల జిక్కుపడుట త్రాడుకట్టుల ద్రెంచుకొని యినుప గొలుసుల గట్టునడుటవంటిది. ఉద్యోగము చేయుట నాకిష్టమగునా? నొకప్రాంతములో బూర్తియగుపరీక్ష నేలవిడిచి పత్తును?"

"పనిలో జేరకున్న మీతండ్రి నీవు యింటినుండి స్వరాజ్యవ్యవహారముల నిరుపుట కంగీకరింపరు."

"అంగీకరింపకున్న వెళ్లెదను."

"వెళ్లుట కోర్వలేకే కదా నా యేడుపు?"

"నీవెంతమాత్రము దుఃఖింపకు. నన్ను ప్రేమతో బంపుము. నేను యిల్లువిడుటే నాకు మేలు. నా పనిని నే జేయవచ్చును. మఱియు నాన్న అనుగ్రహమునుగూడ సంపాదింపవచ్చును. ఎదుటనుండి వ్యతిరేకముగ జేయుచున్నచో ఆయనకు మత్సర మెక్కువ."

"అనుగ్రహమనునది మీనాయనకు లేదు. వదలిపెట్టినా మరల పిలుపు తలపు లుండవు. ఆయన మతమట్టిది. నాకొడుకని ప్రేమపడుమనిషి గాడు,"

"అమ్మా! నాన్న కోపదారియైనంతమాత్రమున ప్రేమశూన్యుడని తలంచుట పొరబాటు. ఆయన వాత్సల్యవంతుడు గానిచో నేనింతవాడ నెట్లైతిని. ఆయన నాపై కోపించుటలో గూడ న్యాయ మేకలదు. నేనెద్దియో గొప్పయుద్యోగము చేసి ఘనుడనగుదునని యాయన గంపెడాశతో నుండ నేనాకస్మికముగ జదువుమానివైచి యాశాభంగము గలిగించితిని. అది ఆయనకు కోపకారణము గాకుండ నెట్లుండును? అట్లు వచ్చినను గూడ మరల నా కుద్యోగమిప్పింప బ్రయత్నించుటగూడ ఆయనకు నాపైగల వాత్సల్యమువలననే. ఉద్యోగములపై నాకుగల యుదాసీనతవలన ఆయన పనులెల్ల స్వార్థచింతగా నాకు దోచుచున్నను, ఆయన కృషిలో మాత్ర మకలంకమగు పుత్రప్రేమ స్పష్టము సూచుచునే యున్నది. కాన నాన్నను దూరరగదు. ఆయన ఆజ్ఞప్రకారము నేను యిలువెడలిపోయి నాపనిని నేను జేసెదను. ప్రేమను ప్రేమచేతనె బడయవచ్చునని నావిశ్వాసము. కాన ఎట్టి యవిశ్వాసము లేక నేను నాన్నను ప్రేమించి ఆయన ప్రేమప్రసాదమును బడయుదును. నీవు మాత్రము విచారింపక దైవమునకును, తండ్రికిని, దేశమాతకును గూడ ప్రీతిపాత్రుడనగునట్లు ఆశీర్వదించి పంపుము. నాకు శుభము కలుగును." అని రామస్వామి తల్లిపాదములపైబడినాడు. లక్ష్మీదేవి యెదురు చెప్పలేదు. "నాయనా! నీనమ్మకము నిన్ను కాచుగాక" అనినది. రామస్వామి నాడే యిలువీడిపోయి కార్యరంగమున బ్రవేశించినాడు. నిర్మాణకార్యక్రమములో కెల్ల నత్యంతముఖ్యమును మహాత్మునకు ప్రియతమమును నైన ఖద్దరు వ్యాపకమునుగూర్చి యత్యంతశ్రద్ధతో బనిచేయ బూనినాడు.

౭

రామస్వామి యిల్లువదలి దాదాపు తొమ్మిది మాసములైనది. నిరంకుశత్వదేవత దేశమంతటను బ్రళయతాండవ మాడుచున్నది. దేశభక్తులతో కారాగారములు నిండిపోవుచున్నవి. దేశములోని తీవ్రపరిస్థితులను బట్టి నాయుడు, ఏనాడు దేశబంధితుడగునో యని లోలోన జంకుచున్నను, నంతకంటె మిన్నగానున్న తామసమునకు వశుడై, రామస్వామిని పిలిపించుటకు మాత్రము యత్నింపలేదు. అసహాయోద్యమప్రచారకుడై రామస్వామి ఆంధ్రదేశమంతట బర్యటనము సేయుచు తనకై తల్లి బెంగపెట్టుకొనకుండుటకై యింటికి తరుచు తనక్షేమవార్త తెలుపుచున్నాడు. వానిని జూచి తల్లియేకాక తండ్రిగూడ మనస్సంతుష్టి నొందుచు ప్రొద్దులు పుచ్చుచున్నారు.

౧౯౨౨ సంవత్సరము వచ్చినది. వేంకయ్యనాయుడుకు నూతనసంవత్సర సందర్భమున రావుసాహేబు బిరుదమీయబడినట్లు తెలుపబడినది.

ఆబిరుదును జూచుకొని తనకేదియో మహాగౌరవము లభించినట్లుగా నాయుడు పరమానందభరితుడైనాడు. అంతకంటె నానందములో నిమగ్నులైనారతనిమిత్రులు. ఆతనికి గలిగిన యీమహాసన్మానమును గాంచి నభినందించుటకై నాయుడుగారి మిత్రులందఱొక యల్పాహారవిందును సభను నేర్పఱచినారు. విందులైన వెనుక సభ యారంభమైనది. పుష్పమాలాలంకృతుడై నాయుడు ఉన్నతాసనముపై నాసీనుడైయుండ, ఆయన మిత్రులు, అనుచరులు, ఆశ్రయులు, మున్నగువారు పద్యములను, శ్లోకములను, నుపన్యాసములను నొక్కుమ్మడి యాతనిపై గురిపించిరి. తదుపరి కృతజ్ఞతాభివందనములర్పింప నాయుడు కరతాళధ్వనులు చెలరేగ లేచి నిలువబడినాడు. "అస్మత్ప్రియ సోదరులారా! బ్రాహ్మణేతర నాయకాగ్రేసరులారా! బ్రాహ్మణాధికార నిర్మూలనదీక్షాదక్షులారా! ఆంగ్లరాజ్యాంగభవనపు మూలస్తంభములారా! నేడు మీరు నాకు జేసిన సత్కారమునకు నేనెంతయు గృతజ్ఞుడను. నాకు రావుసాహేబు బిరుదము మీచే నేను సన్మానింపబడి యత్యంతగౌరవనీయమైనది. మఱియు ప్రభుత్వమువారు నేడు నాకు బిరుదు నొసగి సన్మానించుట నన్ను సన్మానించుటగాక నాయఖిల బ్రాహ్మణేతరసంఘమును సన్మానించుటగా!" అని వేంకయ్యనాయుడు యేమియో చెప్పబోవుచుండ నొకటెలిగ్రాఫు బంట్రోతు రెండు తంతివార్తల జేతబుచ్చుకొని యతిత్వరితముగా సభలోనికి నేతెంచి నాయుడుకందించెను. నాయుడుగారి యుపన్యాస మాగిపోయినది. ఆత్రముతో నాతడా వార్తాకోశముల విప్పి చదివి,

"అక్కటా! తండ్రికి బిరుదు తనయునకు శైదు!" అని



నేలగూలిపోయినాడు. మిత్రులెల్ల రాత్రముతో నాయు డు కడకేగి యాతంతివార్తల తీసి చూచినారు.

"మీకొమరుడు రామస్వామి జాతీయగీతములు పాడుచు స్వదేశవస్త్రములు విక్రయింపు చుండగా పట్టు కొనబడి, యొకసంవత్సరము కఠినశిక్షకు గురియైనాడు. పెద్దజయిలుకు తీపు పంపబడును.

వి. నారాయణరావు.

ప్రియమైనతండ్రీ! నమస్కారములు. స్వరాజ్యాం దోళనము సలుపుచున్నందున నేను శిక్షింపబడితిని. దైవానుగ్రహముండిన-గో నొక్కసంవత్సరమునకు మరల మిమ్ము సందర్శింపగలను. మాఅమ్మ అమాయకురాలు. నాస్థితికి దుఃఖించును. నాయపరాధశతముల క్షమించి జైలునందామె సన్నొకపరి చూచునట్లనుగ్రహింప గోరెద.

విధేయతనయుడు,

రామస్వామి.

అని వ్రాయబడియున్న రెండువార్తలను జదివి, "రామ స్వామి నిజముగా రామస్వామి. అంతయోగ్యుడుమనవర్ణ ములో లేడు" అని సభ్యులెల్లరు కనుల నీరునించిరి. ఇంతలో వేంకయ్యనాయుడు మిత్రుల శైత్యోపచారములచే దేలు కొని, కన్నీళ్లనుత్తరీయమున నొత్తుకొనుచు, 'రామా! నీవు నేను తండ్రిని కాదగినవాడను కాను. నీపాఠశాలాబహి ష్కారమామోదించి నిన్నింటనుంచుకొనినచో నీకిట్టికష్ట ములు వచ్చియుండవుగదా! రామా! రామ సదృశుడవగు నీవు రామునకు గైకవలెనే నేను నీకుదాపురించితిని. కుమా రా! ఇట్టిదయాశూన్యుడగు తండ్రి ప్రాప్తించినందులకు నీమానసమెంత పరితపించుచుండెనో కదా! నాయనా! నాయనువారులేని పరాయియూర కఠినశృంఖలాబద్ధ హస్తుండవై, సాయుధులగు రక్షకభటులు వెంట నడువ, దిక్కులేనిపక్షివలె, కారాగృహము ప్రవే శించితివా! బిడ్డా! నీకుగాని యీ సంపదలు, ఈయధికారములు, సన్మానములు, సౌఖ్య ములు, నాకేల? అవివేకిని, మూర్ఖుడను, కఠినుడను; కావుననే నీతల్లిమాట నిరా కరించితిని! నిన్నిల్లువెడల నడిపితిని! అయ్యో! తండ్రీ! ముడిరొట్టెలు తినుచు కఠినమగు నేలను బవళింపుచు, మోటుపనులు చేయుచు ఒక్కసంవత్సర మెట్లు గడపుదువోయి! అయ్యో! ఈ మహాకష్టమును దరించి నారాముడు మరల నాకన్నుల బడునా! పేరుముసంద్రమూర్తీ! నేను మ్రొక్కుచు న్నాను. వింటివా! నాకొమారుడు జైలునందున్న యొ క్కసంవత్సరము నాబిడ్డతిండియే నాతిండి. నాకొడుకు పవ ళించుకర్కశశయ్యయే నాశయ్య. నాకొడుకుచేయుపని యే నాపని. నీవుత్తనగా నిట్లువ్రతము సలుపుదును. నాకొమ రుని నాకు బ్రసాదింపుము. నీసన్నిధి కేతెంచి నీపాదము లర్పించినీకమూల్యములగుకానుకలర్పింతును. అయ్యలారా! నన్నింటికి జేర్పుడు. నేనిచ్చట నిలువలేను. నాకడుపు మండి పోవుచున్నది." అని తలమోదుకొనుచు నాయుడు మరల నేలబడినాడు. నాయుడునకు గండెచెదరెననియు, ఏక పుత్రుని యాపదనిని సంహింపలేకుండెననియు తలంచి, మిత్రులెల్లరాతని వెంటనె మోటారుబండిపై నెక్కించు కొని యింటికి దీసికొని వెళ్లిరి.

భార్యమొగముచూడగనె నాయుడాడుదానివలె భావురు మన్నాడు. కొమారుని నిర్బంధవార్తవిని, "నా తండ్రిచెఱనుపడనేపడ్డాడా" యనిలక్ష్మీదేవి మొదలునఱికి నకదళివలె నేలబడినది. చాలసేపటివఱకామెకు ప్రాణ మేరాలేదు. ఆభార్యాభర్తల దుఃఖమునుండి తేర్చుట

గుస్సాహమైపోయినది. కట్టతెగిన ప్రవాహమువలె వారి దుఃఖము పొంగిపొంగివచ్చుచున్నది. ఆకొమరుని నొక్కమారు కనులజూచినగాని వారిదుఃఖ మాగదని యెల్లరకు దోచినది. "మీరుభయులువెళ్లి కొమరుని జూచివచ్చుట మంచి"దనిమిత్రులు నాయుడుతో చెప్పిరి. "వానినిజూచు నర్హత నాకు లేదు. అర్హత సంపాదించుకొనువఱకు నేను జూడజాలను. తల్లినిమాత్రము రాత్రికి బంపెద నని నాయుడనెను. నాయుడు హృదయమునందు గలిగినమార్పు తాత్కాలికము గాదని యందఱ కప్పుడు తోచినది.

నాటిరాత్రియే తన తోడబుట్టినవానిని దీసికొని లక్ష్మీదేవి కొమారునిజూచుటకు వెళ్లినది.

౮

ఒకానొకప్పుడు కరుణ, భక్తి, వాత్సల్యము మున్నగు భావముల యాకస్మికోదయము మానవునియం దొక యపూర్వపరిణామమునకు హేతుభూత మగుచుండును. కఠినుని కరుణాశాలిగా, నాస్తికుని భక్తునిగా, మత్సరుని వాత్సల్యపూర్ణునిగా మార్చెడి యీ యపూర్వ శక్తిమానవహృదయమునందు నక్కియుండి, యవసరమును జూచి విజృంభించుట దైవచిత్రముగాని వేరుగాదు.

వేంకయ్యనాయుడు నిన్నటివఱకు సామాన్యులకు దేఱిచూడరాని యధికారి. అధికారములను, నధికారులను దానందగా, నధికారములు,నధికారులుతనకందగా మెలగుచున్నవాడు. పరస్పరాశ్రయమనెడి యిరువంకలలో "నేనత్యున్నతుడను, నా పదవి యత్యున్నతము" లనెడి యహంభావములో సుఖస్వప్నములగాంచుచుండువాడు. ఐశ్వర్యగర్వము, అధికార వ్యామోహము, జాతిమత్సరము లనెడి బిరుసుదుప్పటులు లాతని సుఖసుప్తి యందవలి స్వప్నగాథలకు భంగము కలుగకుండ కాపాడుచుండెను. ఇంతవఱకు ప్రేమోదార విలసితమగు మానవ జగత్తున కతడు కడుదూరముగ నుండెను. కాని నేడాతని హృదయమున హఠాత్తుగా నుదయించిన ప్రేమవాహిని యాతని నొకనవ్యప్రపంచమునకే కొనిపోయినది. ఇంతవఱకపూర్వ మాతని హృదయక్షేత్రమును మలినపఱచుచున్న క్రోధలోభమోహమాత్సర్యాది కల్మషములు లాప్రేమ ప్రవాహములో కొట్టుకొనిపోయి రూపరిపోయినవి. అనేక కల్మషగుణములచే సంకుచితమైయున్న యాతని మనస్సిప్పుడు అకల్మషమై, పవిత్రమై, సువిశాలమై, యుదారభావభాసితముగా మారిపోయినది. చిరకాలముగా నాతనిచే నుపాసితము లగుచున్న జాతిమాత్సర్యాధికార వ్యామోహాది దోషగుణము లన్నియు లాతని హృదయమున నిలువ నీడలేకపలాయనమైనవి. ఆతని విశాలదృష్టికప్పుడు భారతావనిగల భిన్నజాతులు ఒక్కసూత్రమున గ్రుచ్చిన యాణిముత్యములుగా దోచినవి. తనకంటె యధికులని ద్వేషించిన బ్రాహ్మణులు, తనకంటె నల్పులని నిరసించిన యంత్యజులు, తనవారని దురభిమానపడిన యాత్మకులజులు సమానసోదరులే యని యాతనికప్పుడు తోచినది. 'నాయనలారా! మీరందఱు నాకడుపున బుట్టినవారు. మీలో మీకు జాతిమత్సరము తగదు. మీరందఱు నేకమై నాదాస్యవిముక్తికి కృషిసల్పుడ'ని భారతాంబ యాహ్వానించుచున్నట్లు వేంకయ్యనాయుడు తలంచినాడు. ఆదేశజనని పిలుపునకు నాయుడు ముగ్ధుడైపోయినాడు. ఇక సంశయింపలేదు. "నిన్నటివఱకు దేశహితైకకార్యములను దేశారాధకులను బలవద్విరోధిని గానున్న నేనేడు స్వరాజ్యాందోళనలో బ్రవేశింప"నని లజ్జింపలేదు. తన విలువవస్త్రములనెల్ల దీసి యావలపారవైచి, తన యధికారములనెల్ల నొక్కమారుజ్జగించి, తన రావుసాహేబు బిరుదమువలదని తిరస్కరించి, ఖద్దరువస్త్రధారియై ఖద్దరువస్త్రముల విక్రయింపగడగినాడు. కఠినపు జొన్నరొట్టె తిండి, కటికనేలను నిదుర. ఖద్దరువస్త్రములవిక్రయము దినమున కొకయూరు. పూటకొకయూరు. తిండితినినయూర నిదురలేదు. నిదురించినయూర తిండిలేదు. ఒకటే ఖద్దరు ప్రచారము. ప్రతిగ్రామమునకేగిన నాతని కపూర్వమైన స్వాగతసన్మానము జరుగుచున్నది. ప్రజ లాతని నత్యంతప్రేమతో నాదరించుచున్నారు. నాయుడు పూర్వముగూడ నెందఱివలననో సన్మానము లందుకొన్నవాడే, కాని యానాటి సన్మానము లింత యుదారములుగ, ప్రేమపురస్సరములుగ నాతనికి గాన్పింపలేదు. జాత్యభిమానమో, అధికారభీతియో, స్వార్థలాభమో, ఏదియో సంకుచితభావ మాసన్మానములకు మూలకందముగా నుండెడిది. కాని నేటి సన్మానమున కట్టికళంక మిసుమంతయు లేదు. కేవలప్రేమచేతనే

ప్రజలు తన్ను సన్మానింపుచున్నారు. ఆసన్మానమును గాంచి వేంకయ్యనాయుడు తన్మయుడై పోయినాడు. అతని కార్యదీక్ష యినుమడించినది. మనపక్షగౌరవమును పాడుచేసి నీవీ పనిచేయుటేమి యని మిత్రు లాతని నెన్నియోవిధముల ప్రార్థించిరి, బోధించిరి; చివరకు దూషించిరి. కాని నాయుడు వెనుదిరుగలేదు. ఆహా! ఏమి కార్యదీక్ష!

౬

సంవత్సరము నిండినది. రామస్వామి విడుదల దిన మేతెంచినది. బంధితుల నుత్సవముతో కారాగృహంబున బ్రవేశపెట్టుటయు, విముక్తుల నుత్సవముతో వీడ్కొల్పుటయు నిత్యకృత్యముగా బెట్టుకొనిన రాజమండ్రి పౌరులప్పుడే, యుదయ మేడుగంటలైన కాకమునుపే, మేళతాళములతో, పుష్పహారములతో జైలుద్వారముకడ జేరినారు. వారిలో నిద్దరువస్త్రధారియు, కృశీభూతశరీరుడును, దీనవదనుడును, నేబదేండ్లు సమీపించినవాడును నగు నొక యపరిచితవ్యక్తిగూడ నుండెను. అత డెవరో వారు పరికింపలేదు. తానెవరో యాతడు వారికి దెలుపలేదు. సరిగ ఎనిమిదిన్నరగంటలయినది. రక్షకభటులు రామస్వామిని దీసికొనివచ్చి కారాగృహద్వారముకడ విడిచినారు. తోడనె పుష్పవర్షము గురిసినది. జయధ్వనులు చెలరేగినవి. మేళతాళములు మ్రోగినవి. కారాగృహవాసశ్రమచే శుష్కించినవాడయ్యు రామస్వామి అపూర్వమైన దేశభక్త్యుత్సాహము ఆననమున తాండవింప, ఉజ్జ్వలమైన శాంతరసము నయనముల దొలకాడ, ముకుళితకరకమలుండై, మందస్మితవదనారవిందుడై, ప్రజలదెస జూచుచు నిలువబడినాడు. ఇంతలో నెటునుండి వచ్చెనో ఆయపరిచితవ్యక్తి, యొక్కయుదుటున వచ్చి "నాతండ్రీ! కనులబడితివా!" యని రామస్వామిని కౌగిలించుకొనినాడు. ముక్కుమొగ మెఱుగని యాయువకు దన్నంత ప్రేమపురస్సరముగ గౌగిలించుకొనిన యాకృశశరీరు డెవరు? రామస్వామి నివ్వెఱబోయినాడు. అతని కేమైనది తెలియలేదు. "నాయనా! మ



ఱచితివా! అవును: ఈదోషి మఱవదగినవాడె!" అన్నా డప్పుడు వేంకయ్యనాయుడు! అనుతాపతప్తములును విచారపరీతములునగు నావాక్యములు చెవిసోకుటతోడనే రామస్వామి యాతనిదెస పరికించిచూచినాడు. ఎవరతడు? తనతండ్రి! ఆభయంకరాకారము లేదు. ఆదర్పంపువేషము లేదు. ఆరూక్షవీక్షణములు లేవు. తండ్రికి ప్రేమభరితమగు సౌమ్యపురూపెట్లు వచ్చినది! అద్భుతానందము లొక్కుమ్మడి రామస్వామిని జుట్టుముట్టి తన్మయుని గావించినవి. తోడనే పితృభక్తిభరితుడగు నాతని యుత్తమాంగము తండ్రిచరణములపై వ్రాలినది. నాయుని అనుతప్త బాష్పాంబువులతో రామస్వామి యానందబాష్పములు వియ్యమంది యేకప్రేమవాహినిగా బ్రవహించినవి. ఆహా! ఏమి, ప్రేమప్రభావము!